నిప్పుతో ధరణికి ముప్పు!

- పంట వ్యర్థాలను కాల్చితే భూమికి నష్టం
- భూసారాన్ని దెబ్బతీసున్న రైతుల ఆలోచనలు
- పొలంలో కలియదున్నితే మేలు



వరి కోత అనంతరం మిగిలిన ప్రాంతాన్ని కాల్చిన దృశ్యం

సంతబొమ్మాళి: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వరి పంట పండింది. నెల రోజులుగా యంత్రాల ద్వారా కోతలు, నూర్పిడి ముమ్మరంగా జరుగుతున్నాయి. అదే పొలంలో రబీలో మరో పంట వేసేందుకు పొలాన్ని దమ్ము చేసేందుకు పంట వ్యర్థాలు అడ్డంకిగా నిలుస్తున్నాయి. రైతులు వరి చేసు వ్యర్థాల (గడ్డి)కి పొలాల్లోనే నిప్పు పెడుతున్నారు. అయితే వీరు తీసుకుంటున్న ఈ నిర్ణయం కారణంగా వారికి తెలియకుండానే భూసారానికి నష్టం చేకూర్చుతున్నారు.

యంత్రాలతో కోతలు జరిగిన పొలంలోనే..

టెక్కలి నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోనూ వరి కోతలు కోసిన రైతులు పంటల వ్యర్థాలకు నిప్పు పెడుతున్నారు. యంత్రాల ద్వారా ఎక్కువ ఎత్తులో కోత చేస్తారు. కోసిన తర్వాత ధాన్యం ఇంటికి చేరుకోగా గడ్డి పొలం నిండా పరుచుకుంటుంది. రబీలో పంట వేయాలంటే దుక్కి, దమ్ము చేసేందుకు దీన్నిలేకుండా చేయాలి. ఆ గడ్డిని ఒక చోటకు చేర్చి కుప్ప పెట్టాలంటే రైతులకు అదనపు ఖర్చుతో కూడిన పని అవుతుంది. గడ్డికి నిప్పు పెట్టిన తర్వాత రబీ పంటను వేసుకుంటున్నారు.

మిత్ర పురుగులకు హాని..

రైతులు తీసుకుంటున్న నిర్ణయం కారణంగా రైతులకు మేలు చేసే మిత్ర పురుగులు క్షీణిస్తున్నాయని వ్యవసాయశాఖ అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. పొలంలో పరుచుకున్న గడ్డిని కాల్చడం వలన భూమి పైపొరల్లో ఉండే మిత్ర పురుగులు వేడికి నాశనం అవుతున్నాయి. భూమిలో ఉండే వానపాములు, ఇతర సిలీంద్రాలు అంతరించి పోవడం వలన భూమికి నష్టం వాటిల్లుతోందని హెచ్చరిస్తున్నారు.

ఇబ్బంది లేకుండా..

వరిచేనును యంత్రాలతో కోత కోసిన అనంతరం పొలంలో గడ్డి ఉండిపోతుంది. గడ్డి మట్టిలో కలిసేందుకు ఎక్కువ సమయం పడుతుంది. మరో పంట వేసుకునేందుకు ఇబ్బందిగా ఉన్నందున గడ్డిని కాల్చేస్తున్నాం. తరువాత పొలాన్ని దుక్కి, దమ్ము చేసి రెండో పంట వేసుకుంటున్నాం.

– దల్లి యర్రయ్య, రైతు, హెచ్‌ఎన్ పేట

అవగాహన కల్పిస్తున్నాం

పొలంలో పంటల వ్యవర్థాలకు నిప్పు పెట్టడం వలన భూమి పొరల్లో ఉన్న సిలీంద్రాలు ఇతర సూక్ష్మజీవులు, మిత్ర పురుగులు నశించిపోతాయి. యంత్రాలతో కోత కోసిన తరువాత వ్యర్థాలను ఒక చోట చేర్చి అవి కుళ్లేలా చేయడం వలన సేంద్రీయ ఎరువు తయారవుతుంది. ఆ ఎరువును పొలానికి వాడుకోవచ్చు. వ్యర్థాలకు నిప్పు పెట్టకుండా ఉండాలని రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– ఆర్. అప్పారావు, మండల వ్యవసాయాధికారి, సంతబొమ్మాళి

క్లుప్తంగా

సైబర్ నేరాలపై అవగాహన



జీడిపేటలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ రాము

టెక్కలి రూరల్: ప్రజలు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని టెక్కలి ఎస్‌ఐ రాము అన్నారు. మేఘవరం, జీడిపేట గ్రామాలలో సంకల్పం కార్యక్రమంలో భాగంగా మత్తు పదార్థాలు, సైబర్ నేరాలపై శనివారం అవగాహన కల్పించారు. మద్యం తాగి వాహనాలు నడపడం ప్రమాదకరమని, చట్టరీత్యా నేరమన్నారు. ఏఎస్సై వెంకటరమణ ఉన్నారు.

గోదాదేవికి పెళ్లిసారె మహోత్సవం



అమ్మవారికి సారెను సమర్పించిన దృశ్యం

టెక్కలి: స్థానిక లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో ధనుర్మాసం ఉత్సవాల్లో భాగంగా శనివారం గోదాదేవికి పెళ్లి సారె మహోత్సవాన్ని నిర్వహించారు. రంగనాథస్వామి, గోదాదేవి కల్యాణ మహోత్సవంలో భాగంగా ఈ నెల 13వ తేదీన కల్యాణాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. పలు రకాల పిండి వంటలు, మిఠాయిలతో అమ్మవారికి భక్తులు సారెను సమర్పించారు.

రీ సర్వేను సద్వినియోగపర్చుకోండి



ర్యాలీలో తహసీల్దార్ రమేష్‌కుమార్ తదితరులు

కంచిలి: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న రీ సర్వేను సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ ఎన్.రమేష్‌కుమార్ అన్నారు. నరసన్న ముకుందాపురం గ్రామంలో భూముల రీ సర్వే కార్యక్రమాన్ని శనివారం నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రచారం చేస్తూ ర్యాలీ చేపట్టారు. భూములకు సంబంధించి ఎటువంటి సమస్యలున్నా రీ సర్వేలో సరిచేసుకోవచ్చన్నారు. మండల సర్వేయర్ చలపతిరావు, వీఆర్వో హర్ష ఉన్నారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ కార్యకర్తలు

టెక్కలి: పంట పెట్టుబడి సాయం పెంచడంపై హర్షం వ్యక్తం చేస్తూ టెక్కలి మండలం మేఘవరం పంచాయతీ జీడీపేట గ్రామంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి రైతులు, బీజేపీ కార్యకర్తలు శనివారం క్షీరాభిషేకం చేశారు. నాయకులు, కార్యకర్తలు ఎస్.లక్ష్మీనారాయణ, జె.పరమేశ్వరరావు, లింగరాజు, ఆర్.నీలయ్య, ఎస్.శ్రీను, పి.ఉమాబాబు, పి.రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

హెల్మెట్ వినియోగంపై అవగాహన

కాశీబుగ్గ: హెల్మెట్ లేకుండా ప్రయాణం చేయడం ప్రమాదకరమని కాశీబుగ్గ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణ అన్నారు. పలాస–కాశీబుగ్గ పోలీసుల ఆధ్వర్యంలో హెల్మెట్ వినియోగంపై శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. వాహనదారులు విధిగాహెల్మెట్ ధరించాలని, మద్యం తాగి వాహనాలు నడపరాదని సూచించారు. కార్యక్రమంలో ఐటీఐ ప్రిన్సిపాల్ పైల జవహర్, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యక్తి అరెస్టు

సోంపేట: జింకిభద్రలో అదే గ్రామానికి చెందిన శ్యాం సుందర్ నుంచి పది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని అతన్ని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ లవరాజు శనివారం తెలిపారు. బెల్టుషాపులు నిర్వహించే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

దోకులపాడులో పారిశుద్ధ్య పనులు

వజ్రపుకొత్తూరు రూరల్: దోకులపాడు గ్రామంలో సర్పంచ్ వడ్డి సరితాకరుణాకర్ పర్యవేక్షణలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు శనివారం చేపట్టారు. డ్రైనేజీలలో పేరుకుపోయిన చెత్త చెదారాన్ని తొలిగించి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. ఎంపీటీసీ సభ్యురాలు కొయిరి భాగ్యలక్ష్మి ఢిల్లేశ్వరరావు, మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు యంపల్ల పాపారావు, బిలాయ్ సంఘ కార్యదర్శి వడ్డి అప్పారావు, పంచాయితీ కార్యదర్శి యాదవరాజు ఉన్నారు.

పౌష్టికాహారానికి ప్రాధాన్యత

వజ్రపుకొత్తూరు: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పౌష్టికారం తీసుకునేలా అవగాహన కల్పించాలని ఎంపీడీవో ఎన్.రమేష్‌నాయుడు అన్నారు. మండల వెలుగు కార్యాలయంలో కాశీబుగ్గ ఐసీడీఎస్ సీడీపీఓ కవిటి పార్వతి అధ్యక్షతన అంగన్‌వాడీ కార్యకర్తలతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యకర్తలు కేంద్రాల్లో సమయ పాలన పాటించాలని, బాల్య వివాహాలను క్షేత్ర స్థాయిలో నిర్మూలించాలన్నారు.

మధ్యాహ్న భోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- ఆర్డీవో కృష్ణమూర్తి



టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భోజన పథకం ప్రారంభిస్తున్న ఆర్డీవో కృష్ణమూర్తి తదితరులు



కాశీబుగ్గ: భోజనాన్ని వడ్డిస్తున్న ఎమ్మెల్యే శిరీష



కంచిలి: విద్యార్థులకు భోజనాన్ని వడ్డిస్తున్న అధికారులు

టెక్కలి: ఇంటర్ విద్యార్థుల కోసం అమలు చేసిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి అన్నారు. టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణంలోని జూనియర్ కళాశాలల్లో చదువుతున్న పేద, సామాన్యవర్గాలకు చెందిన విద్యార్థులకు ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతోందన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. తహసీల్దార్ దిలీప్‌చక్రవర్తి, ఎంపీడీవో లక్ష్మీబాయి, ఎంఈవోలు డి.తులసీరెడ్డి, డి.చిన్నారావు, కళాశాల ప్రిన్సిపాల్ వి.కిరణ్మయి, నాయకులు ఎం.సుందరమ్మ, కె.కిరణ్, బి.శేషగిరి, ఎం.దమయంతి పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: గోవిందపురం జూనియర్ కళాశాలలో భోజన పథకాన్ని ప్రిన్సిపాల్ కె.రమేష్ పట్నాయక్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ ఈశ్వరరావు, నాయకులు సూరాడ మోహనరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కర్ని రమణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

కంచిలి: కంచిలిలోని జూనియర్ కళాశాలలో భోజన పథకానికి అవసరమైన స్టీల్ ప్లేట్లు, గ్లాసులు, హాట్‌బాక్సులను దాతలు విరాళంగా అందించారు. ఎంపీడీవో వి.తిరుమలరావు, ఎంఈవో ఎస్.శివరాంప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ జగదీష్‌కుమార్‌ల చేతులమీదుగా భోజన పథకాన్ని ప్రారంభించారు. కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు రూరల్: వజ్రపుకొత్తూరుని జూనియర్ కళాశాలల భోజన పథకాన్ని ఎంపీడీవో రమేష్ నాయుడు ప్రారంభించారు. ప్రిన్సిపాల్ తారకేశ్వర్ పండా, కళాశాల సిబ్బంది ఉన్నారు.

నందిగాం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో భోజన పథకాన్ని మండల ప్రత్యేకాధికారి గోపిబాల ప్రారంభించారు. ప్రిన్సిపాల్ ఎం.క్రిష్ణమోహన్, ఎంపీడీఓ రాజారావు, ఎంఈవోలు జి.నర్సింహులు, చిన్నారావు, ఉన్నత పాఠశాల హెచ్ఎం హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కవిటి: స్థానిక జూనియర్ కళాశాలలో భోజన పథకం ప్రారంభమైంది. కవిటి సర్పంచ్ పూడి లక్ష్మణరావు, మండల కోఆప్షన్ సభ్యుడు పాండవ చంద్రశేఖర్, ఎంపీడీఓ కె.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రారంభించారు. డీఈవో తిరుమల చైతన్య, మున్సిపల్ ఛైర్మన్ గిరిబాబు, ప్రత్యేక అధికారి చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ నరసింహులు, ఎంఈవో సత్యం పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: పట్టణంలోని బాలురు, బాలికల జూనియర్ కళాశాల, ఆదర్శ పాఠశాలలో భోజన పథకం ప్రారంభమైంది. ఎంఈవో–2 విశ్వనాథం, కళాశాలల ప్రిన్సిపాళ్లు జె.సాదయ్య, వి.శంకరరావు, దుంపల వైకుంఠరావు, ఏఈ సునీల్ పాల్గొన్నారు. వంద ప్లేట్లు, 50 గ్లాసులు వ్యాపారవేత్త కె.శ్రీనివాసరావు వితరణ చేశారు.

ఉద్యోగుల పనితీరుపై కలెక్టర్ అసంతృప్తి

కిడ్నీ ఆస్పత్రి, మంచినీటి సరఫరాపై సమీక్ష



సమీక్షలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తదితరులు

కాశీబుగ్గ: పలు శాఖలకు చెందిన సిబ్బంది పనితీరుపై జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉద్దానం కిడ్నీ బాధితుల అవసరార్థం గత ప్రభుత్వం నిర్మించిన పలాస కిడ్నీ పరిశోధన కేంద్రం, డయాలసిస్ యూనిట్, 200 పడకల ఆస్పత్రిపై పలాస–కాశీబుగ్గ మున్సిపల్ సర్వసభ్య సమావేశ మందిరంలో ఎమ్మెల్యే గౌతు శిరీషతో కలిసి శనివారం సాయంత్రం సమీక్షించారు. కిడ్నీ పరిశోధన కేంద్రం పనితీరుపై ఆరా తీశారు. ఉద్దానం రెండు నియోజకవర్గాలు, ఏడు మండలాల పరిధిలో ఉన్న కిడ్నీ రోగుల స్థితిగతులు ఎలా ఉన్నాయి, వారికి వైద్య సేవలు అందుతున్నాయా లేదా, వంశధార నుంచి వచ్చే తాగునీరు ఎంతమేరకు చేరుతున్నాయనే అంశాలపై శాఖలు.. మండలాల వారీగా అడిగి తెలుసుకున్నారు. కిడ్నీ పరిశోధన కేంద్రంలో నెఫ్రోప్లస్ డయాలసిస్ సేవలతో పాటు అక్కడ అందిస్తున్న మందులు, ఇంజక్షన్లు, పరీక్షలు, ఇతర అంశాలపై సూపరింటెండెంట్ డాక్టర్ అల్లు పద్మజకు వివరణ కోరారు. వైద్యులు, సిబ్బంది, ల్యాబొరేటరీ పరీక్షలు, యంత్రాల పనితీరు, మందులు అందించే సేవలపై విభాగాల వారీగా కలెక్టర్ మాట్లాడారు. ఇన్ పేషెంట్లకు డైట్ ఇవ్వలేక పోతున్నారని, ప్రహరీ, నీటి సమస్యలు, సిబ్బంది కొరత, యంత్రాల కొరత వంటి అంశాలను పలువురు కలెక్టర్ దృష్టి తీసుకెళ్లారు. తాత్కాలిక రక్షణ కవచానికి రూ. 30 లక్షలు అవుతుందని సంబంధిత సిబ్బంది చెప్పడంతో లెక్కలు వేసి రూ.10 లక్షలు అవ్వాల్సినదానికి రూ. 20 లక్షలు అదనంగా చెబుతున్నారని.. పలాస సిబ్బంది పని తీరు ఇలా ఉంటుందా అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఉద్దాన ప్రాంతంలో ఎన్ని గ్రామాలకు తాగునీరు అందుతుందో మండలాల వారీగా అడిగి నమోదు చేసుకున్నారు. ఉద్దాన ప్రాజెక్టు, జీజీఎం, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పష్టమైన వివరాలు చెప్పలేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. మున్సిపాలిటీలో శానిటేషన్, బయోమైనింగ్, ప్రకటనల బోర్డుల ఆదాయం, ఆశీల్ల వసూలు వివరాలు సక్రమంగా లేకపోవడంతో కలెక్టర్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. పలాస పరిధిలో పరిశ్రమలకు కేటాయించిన స్థలం విషయంలో రెవెన్యూ అధికారులు ముందుకు వెళ్లలేని పరిస్థితులను తెలుసుకొని తహసీల్దార్ కళ్యాణచక్రవర్తిపై కలెక్టర్‌పై మండిపడ్డారు. పలువురు అధికారుల తీరు సక్రమంగా లేనట్టు గుర్తించి వారిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. త్వరలోనే మరోసారి తాగునీరు, కిడ్నీ వ్యాధులు, రెవెన్యూ శాఖలపై సమీక్షిస్తానని కలెక్టర్ వెల్లడించారు.

లూయీస్ బ్రెయిలీకి నివాళులు



ఇచ్ఛాపురం: చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం



టెక్కలి రూరల్: బ్రెయిలీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంఈవోలు

ఇచ్ఛాపురం: ముత్యాలమ్మపేట మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో లూయిస్ బ్రెయిలీ జయంతి కార్యక్రమాన్ని మండల ఎంఈవో–2 ఎస్.విశ్వనాథం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ప్రత్యేక అవసరాల చిన్నారులకు వివిధ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఏఈ సునీల్, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది ఉదయ్‌భాస్కర్, నాగమణి, సహిత ఉపాధ్యాయురాలు ఎస్.సూర్యం, హెచ్.సోమేష్, మండల విద్యా వనరుల కేంద్ర సిబ్బంది కామేష్, రవికుమార్, దేవరాజ్, గణేష్, సత్యన్నారాయణ పాల్గొన్నారు.

టెక్కలి రూరల్: స్థానిక భవిత కేంద్రంలో లూయిస్ బ్రెయిలీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఎంఈవోలు డి.తులసీరావు, డి.చిన్నారావులు ప్రపంచ బ్రెయిలీ దినోత్సవ ప్రాధాన్యతను చిన్నారులకు వివరించారు. అంతక ముందు బ్రెయిలీ చిత్రపటానికి నివాళులర్పించారు. స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు టి.వనజకుమారి, సహిత ఉపాధ్యాయులు ఎ.మన్మథరావు, ఎం.ధనుంజయ్‌రావు పాల్గొన్నారు.

‘టాలెంట్’ చూపిన విద్యార్థులు



ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో టాలెంట్ టెస్టును ప్రారంభిస్తున్న ఎంఈవో–2 ఎస్.విశ్వనాథం



కవిటి: జిల్లాస్థాయి పోటీలకు అర్హత సాధించిన విద్యార్థులతో కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం మల్లేశ్వరరావు, సిబ్బంది



నందిగాం: విజేతగా నిలిచిన కణితూరు విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అధికారులు



కాశీబుగ్గ: కాశీబుగ్గలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

ఏపీ బయోలాజికల్ సైన్స్ టీచర్స్ ఫోరమ్ ఆధ్వర్యంలో మండలస్థాయి జీవశాస్త్ర టాలెంట్ పరీక్షలు శనివారం జరిగాయి. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభను కనబర్చారు. ఇక్కడ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను జిల్లాస్థాయిలో నిర్వహించే ప్రతిభ పరీక్షలకు పంపించనున్నారు. ఎంఈవోలు, ప్రధాన ఉపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు హాజరై మండల స్థాయి విజేతలకు బహుమతులను అందజేశారు. జిల్లాస్థాయిలో సత్తాచాటాలని ఆకాంక్షించారు.

–సాక్షి నెట్‌వర్క్

ఆదరణ కరువు..



కాశీబుగ్గ ఆర్‌అండ్‌బీ బంగ్లా ఆదరణ కరువైంది. బ్రిటిష్ కాలం నాటి ఈ బంగ్లా పదేళ్ల క్రితం వరకు అతిథులకు ఆతిథ్యం ఇచ్చిన బంగ్లా నేడు నిరాదరణకు గురైంది. అధికారులు కూడా గాలికి వదిలేయడంతో ఆ పరిసరాల్లో ఉన్న కొందరు తమకు అనూకూలంగా మార్చేసుకుంటున్నారు. ముఖ్యమంత్రులుగా పని చేసిన జలగం వెంగళరావు, ఎన్టీఆర్, పలువురు సినీ నటులు, గవర్నర్లు ఈ ప్రాంత పర్యటనకు వచ్చే సమయంలో ఇక్కడే బస చేసేవారు. కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌కు పక్కనే ఉన్న ఈ బంగ్లాను పట్టించుకోకపోవడంతో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారుతోంది.

–పలాస

రైతు‘బడి’..



ఇటీవల కురిసిన వర్షాలకు నీట మునిగిన పంటను రక్షించుకునేందుకు రైతులు ప్రయత్నిస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని ఎండలో ఆరబెట్టేందుకు పాఠశాల ఆవరణను సైతం వదల్లేదు. టి.బరంపురం ప్రాథమిక పాఠశాల ఆవరణలో తడిసిన ధాన్యాన్ని రైతులు శుక్రవారం ఆరబెడుతూ అమ్మకాలకు సిద్ధం చేశారు. పాఠశాల ముందు ధాన్యాన్ని ఆరబెట్టడం సరికాదని కొంతమంది అభిప్రాయం వ్యక్తం చేశారు.

–ఇచ్ఛాపురం రూరల్

పోలీసుల తనిఖీలు..



మాదకద్రవ్యాల విక్రయాలు, వినియోగించేవారిపై కఠిన చర్యలు తప్పవని నౌపడ ఎస్‌ఐ జి. నారాయణస్వామి హెచ్చరించారు. మండల కేంద్రంలోని పలు షాపుల్లో డాగ్ స్క్వాడ్ సహాయంతో మాదకద్రవ్యాలను గుర్తించేందుకు శనివారం సిబ్బందితో కలిసి విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. తనిఖీల్లో నౌపడ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

–సంతబొమ్మాళి

రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపిక..



టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలకు చెంది డిప్లమో విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు శనివారం తెలిపారు. ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు విశాఖపట్టణం కంచరపాలెం పాలిటెక్నిక్ కళాశాలలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్, పరుగు పందెం, షార్ట్‌పుట్ తదితర క్రీడలకు ఎంపికైనట్లు వెల్లడించారు. ఎంపికైన విద్యార్థులను డిప్లమో డైరెక్టర్ బి.శ్రీనివాసరావు, అధ్యాపకులు బి.మణికంఠ, పి.సురేష్, బి.శివశ్రీనివాస్, పీడీలు ఎస్.లక్ష్మణమూర్తి, టి.మురళిమోహన్, జె.తేజేశ్వరి అభినందించారు.

–టెక్కలి

టార్గెట్ పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు

- కోటబొమ్మాళి మండల సమావేశంలో సభ్యులు



మాట్లాడుతున్న కోటబొమ్మాళి ఎంపీపీ రోణంకి ఉమా మల్లయ్య

టెక్కలి: ధాన్యం కొనుగోలు ప్రక్రియలో టార్గెట్ల పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని దీనిపై చర్యలు తీసుకోవాలని పలువురు సభ్యులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. కోటబొమ్మాళి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రోణంకి ఉమా మల్లయ్య అధ్యక్షతన శనివారం సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి పనులకు సంబంధించి అధికారులు తప్పనిసరిగా ప్రోటోకాల్ పాటించాలన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో మిల్లర్లపై ఎందుకు దృష్టి సారించడం లేదని పలువురు సభ్యులు అధికారులను నిలదీశారు. ఇటీవల యలమంచిలి పంచాయతీ మామిడివానిపేటలో నిరుపేద కుటుంబానికి చెందిన ఇంటి పునాదుల కూల్చివేతపై అధికారులు స్పష్టమైన సంజాయిషీ చెప్పాలని సభ్యులు డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా సొడాం ఎంపీటీసీ సభ్యురాలు భర్త సింహాచలం సమావేశానికి హాజరై పలువురు సభ్యులు మాట్లాడుతున్న సమయంలో అడ్డుతగిలి అభ్యంతరాలను వ్యక్తం చేయడం సమావేశంలో విస్మయానికి గురి చేసింది. జెడ్పీటీసీ సభ్యుడు దుబ్బ వెంకట్రావు, ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్, వైస్ ఎంపీపీలు బోయిన నాగేశ్వరరావు, డి.రోజారాణి, కోటబొమ్మాళి సర్పంచ్ కె.సంజీవరావు, సభ్యులు పి.వెంకట్రావు, ఎస్.హేమసుందర్‌రాజు, ఎస్.వెంకటరమణ, హెచ్.గోవింద్, డి.సిమ్మన్న పాల్గొన్నారు.

కళలను ప్రోత్సహించాలి



త్యాగరాజు వేషధారణలో కళాకారులు



హాజరైన కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, జెడ్పీ ఛైర్‌పర్సన్ విజయ, ఎమ్మెల్సీ రామారావు తదితరులు

సోంపేట: కళలను ప్రోత్సహించాలని వక్తలు అన్నారు. త్యాగరాజు స్వామి ఆరాధనోత్సవముల్లో భాగంగా సోంపేటలోని నిమ్మన పురుషోత్తం భాగవతార్ కళావేదిక వద్ద ఎంపీపీ నిమ్మన దాస్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సంగీత విభావరి శ్రోతలను అలరించింది. జింకిభద్ర గ్రామం నుంచి త్యాగరాజు స్వామి వేషధారణతో భక్తులు రామనామ సంకీర్తన కార్యక్రమాన్ని సోంపేట పట్టణంలోని కళావేదిక వరకు నిర్వహించారు. పలువురు కళాకారులు తమ కళలను ప్రదర్శించారు. సాయంత్రం కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్యే బి.అశోక్, ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ మంత్రి గౌతు శ్యామసుందరశివాజీ హాజరై మాట్లాడారు. భారతదేశం కళలకు పుట్టినిల్లన్నారు. కళలను, కళాకారులను ప్రతీ ఒక్కరు గౌరవించి ప్రోత్సాహించాలన్నారు. విభావరిలో భాగంగా పద్మశ్రీ యల్లా వెంకటేశ్వరరావు మృదంగ విద్వాంసులు నిర్వహించిన సంగీత విభావరి శ్రోతలను మంత్రముగ్ధులను చేసింది. కళాకారులు క్రాంతి స్వరూప్, పేరిత్యాగరాజు, నందకుమార్, అనంత కృష్ణ, బి.సత్యవరప్రసాద్ తమ ప్రతిభను చాటారు.